క్లుప్తంగా

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆలూరు: రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలించుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్‌ గుమ్మనూరు శ్రీనివాసులు అన్నారు. స్థానిక మంత్రి నివాసంలో బుధవారం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే సత్తా రవీంద్రారెడ్డికి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరాములు, పార్టీ మండల కన్వీనర్‌ వీరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

మల్లెపల్లెలో రేపు దేవతా విగ్రహాల ప్రతిష్ఠ

వెల్దుర్తి: మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో ఈనెల 27న సుంకులా పరమేశ్వరి, పెద్దమ్మతల్లి, ఆంజనేయస్వామి, అఘోరయ్య, ఎల్లమ్మ, కొండమ్మ, వాల్మీకి మహర్షి విగ్రహాలతో పాటు బొడ్రాయి, ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు ప్రారంభమయ్యాయి. గురువారం 26న దేవతామూర్తుల గ్రామోత్సవం, రాత్రి పంచమాంకములు నాటకం, 27న విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

పత్తికొండ రూరల్‌: స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రిటైర్డు టీచర్‌ చక్రాల రంగన్న జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు రంగనాథ రాజు బంగారు, వెండి, పతకాలను విరాళంగా ఇచ్చారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీలో ఎంఈఓ మస్తాన్‌వలిని కలిసి రెండు బంగారు పతకాలు, ఆరు వెండి పతకాలను ఆయనకు అందజేశారు. రిపబ్లిక్‌ డే సందర్భంగా జరిగే వేడుకలో విద్యార్థులకు వాటిని బహుకరించాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు ప్రకాశ్‌రెడ్డి, అబ్దుల్‌రహిమాన్‌ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

పత్తికొండ రూరల్‌/వెల్దుర్తి/చిప్పగిరి/ఎమ్మిగనూరు టౌన్‌: ప్రింట్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే నాయకులు బుధవారం పలు చోట్ల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. పత్తికొండలతో ఆర్డీఓ మోహన్‌దాస్‌ను వెల్దుర్తి, చిప్పగిరి, ఎమ్మిగనూరు మండల కేంద్రాల్లో తహసీల్దార్లు రాజేశ్వరి, లక్ష్మీనారాయణ, జయన్నలను జర్నలిస్టులు కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌, ఇంటి స్థలాలు, పిల్లల చదువుకు ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. వేతనాలు లేక దుర్భర జీవితం గడుపుతున్న జర్నలిస్టులపై వృత్తి పన్ను విధించడం తగదని, ఈ ఆలోచనను విరమించుకోవాలని కోరారు.

పంటల సాగుకు ఆర్డీటీ సహకారం



పనులు ప్రారంభిస్తున్న రైతులు

మద్దికెర: హంప గ్రామ వ్యవసాయ పొలాల్లోని రాళ్లను తొలగించేందుకు ఆర్డీటీ (రూరల్‌ డెవలప్‌మెంట్‌ ట్రస్ట్‌) రూ.1.60 లక్షలు కేటాయించి సహకరిస్తోందని రైతులు చంద్ర, చిన్న మల్లయ్య,ఉశేని, కాంతయ్య, రత్నమయ్య తెలిపా రు. బుధవారం పొలాల్లో పనులు ప్రారంభించారు. 40 ఎస్సీ కుటుంబాల రైతులకు చెందిన పొలాల్లో ఉన్న రాళ్లను తీసేందుకు జేసీబీని ఒక్కో రైతుకు 4 గంటలు కేటాయించినట్లు చెప్పారు.

ఫేస్‌ యాప్‌ రద్దు చేయాలి

పత్తికొండ రూరల్‌: ఫేస్‌ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు స్థానిక ఐసీడీఎస్‌ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా ఉపాధ్యక్షురాలు శోభ మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని, పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని, పదవీవిరమణ పొందిన అంగన్‌వాడీలకు బెనిఫిట్స్‌ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గోపాల్‌, జ్యోతి, మాధవి పాల్గొన్నారు.

వలసలు నివారించాలి

పత్తికొండ రూరల్‌: వలసలను నివారించి స్థానికంగానే ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెద్దహుల్తి సురేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని హోసూరు, పత్తికొండ, దూదేకొండ, చిన్నహుల్తి, నలకదొడ్డి గ్రామాల్లోని సచివాలయాల్లో సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసన్న, ఈరన్న, బుజులు, రంగన్న పాల్గొన్నారు.

పూజలకు వేళాయె!

● నేటి నుంచి సిద్దేశ్వరస్వామి జాతర ఉత్సవాలు



గుహలో వెలిసిన సిద్దేశ్వరస్వామి విరాట్‌మూర్తి



హొళగుందలోని సిద్దేశ్వరస్వామి ఆలయం

హొళగుంద: మండల కేంద్రంలోని సిద్దేశ్వరస్వామి పూజలుందుకునేందుకు సిద్ధమయ్యారు. గురువారం నుంచి జాతర ఉత్సవాలు మొదలుకానున్నాయి. మొదటి రోజు కంకణ ధారణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచే గాక కర్ణాటక నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలిరానుండటంతో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవ వివరాలు..

మొదటి రోజు గురువారం కంకణధారణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 29న నంది, 30న గజోత్సవ ఉచ్చాయాలు జరగనున్నాయి. 31న రథోత్సవం, ఫిబ్రవరి 1న లంకా దహనం, 2న వసంతోత్సవంతో జాతర ఉత్సవాలు ముగియనున్నాయి.

ఉత్సవాల్లో భాగంగా కోలాటం, గడినాడ కన్నడ కళా యువక సంఘం ఆధ్వర్యంలో స్థానిక కళాకారులతో 'కలియుగదల్లి గర్జిసిద కర్ణ అర్జునరు' కన్నడ సామాజిక నాటకం భక్తులను అలరించనున్నాయి. కాగా నేటి నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజ పంపన్నగౌడ్‌ తెలిపారు. లంకాదహనం కార్యక్రమానికి బాణా సంచా సిద్ధమవుతుందని, రథోత్సవం సాఫీగా సాగేందుకు భక్తులు తిలకించడానికి తేరువీధిని గ్రావెల్‌ వేసి బాగు చేస్తామని చెప్పారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

జాతరలో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. తేరుబజారు, రథం, ఆలయ పరిసరాల్లోని ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని పంచాయతీ సిబ్బందిలో తొలగింపు పనులు చేపట్టాం.
– రాజశేఖర్‌, పంచాయతీ సెక్రటరీ, హొళగుంద

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ నరసింహమూర్తి

మద్దికెర: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏపీఓ రవీంద్రనాథ్‌ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగిసినందున వెంటనే పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో సిబ్బంది నరేంద్ర, రాఘవేంద్ర, వెంకటేశ్వరరెడ్డి, రాజశేఖర్‌, ఈరన్న, పరమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

నందవరం: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముగతి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు, పొదుపు సంఘం ద్వారా రూ.35 వేల రుణం ఇస్తుందన్నారు. అలాగే సీసీ రోడ్లు, డ్రెయినేజీ, విద్యుద్దీపాలు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నామని వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జయరాం ఉన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ముస్తాబు

కృష్ణగిరి: గణతంత్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించుకునేందుకు మండలంలోని అన్ని కార్యాలయాలు, విద్యాలయాలు ముస్తాబయ్యాయి. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేసేందుకు విద్యార్థులు సిద్ధమయ్యారు. మండల ప్రజలకు, అధికారులకు తహసీల్దార్‌ పురుషోత్తం, ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలను ప్రశాంతగా జరుపుకోవాలని వారు సూచించారు.

కూలీలకు పనులు కల్పించండి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మన్న

కృష్ణగిరి: గ్రామాల్లో వలసల నివారణే లక్ష్యంగా అడిగిన వారందిరికీ ఉపాధి పనులను కల్పించాలని ఏపీడీ లక్ష్మన్న ఆదేశించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం ఆయన ఎంపీడీఓ మోహన్‌కుమార్‌తో కలిసి ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో ఉండే కూలీలందరిలో కేవలం 35 శాతం మించి పనులకు రావడం లేదన్నారు. గ్రామాల్లో పని అడిగిన కూలీందరికి పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు కూడా చాలా వరకు పూర్తయ్యాయన్నారు. దీంతో కూలీలు పనులకు వచ్చేలా సీనియర్‌ మేటీలు కృషి చేయాలన్నారు. జిల్లా విజిలెన్స్‌ అధికారి సిద్దలింగమూర్తి మాట్లాడుతూ గత సమాజిక తనిఖీలో రికవరీకి ఆదేశించిన మొత్తాన్ని చెల్లించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఇప్పటివరకు రూ.లక్షన్నర వరకు చెల్లించారని మిగిలిన మొత్తాన్ని త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఓలు అబ్దుల్‌షుకూర్‌, శ్రీనివాసులు ఇన్‌చార్జ్‌ ఈసీ శేషిరెడ్డి, టెక్నికల్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు, సీనియర్‌ మేటీలు పాల్గొన్నారు.

ఉపాధి పనిదినాలు పెంచాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు: గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనిదినాలు పెంచి, సరిపడా వేతనం పడేలా చూడాలని వ్యవసాయ ఏపీ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మన్న, మండల అధ్యక్షుడు ఏసేపు డిమాండ్‌ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీఓ బంగారమ్మకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రోజు కూలీ వేతనం తక్కువగా ఉండటంతో గ్రామీణులు ఉపాధి కోసం వలస వెళ్తున్నారన్నారు. వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఆనందు, ప్రసాద్‌ పాల్గొన్నారు.

అమ్మవార్లకు బోనాలు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలో దేవర సందర్భంగా బుధవారం సుంకులమ్మవ్వ, దుగ్గెమ్మవ్వలకు భక్తులు బోనాలు సమర్పించారు. ముందుగా గంగ, ఆకు పూజ, కుంకుమార్చన, మంగళహారతులు ఇచ్చారు. అనంతరం మహిళలు కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. పూజల్లో దేవరగట్టు ఆలయ చైర్మన్‌ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం తనిఖీ

ఎమ్మిగనూరు టౌన్‌: పట్టణంలోని 13వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలను కోఆపరేటివ్‌ స్టోర్స్‌ చైర్మన్‌ షబ్బీర్‌అహమ్మద్‌ బుధవారం పరిశీలించారు. క్యూరింగ్‌ పనులను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో గంధం సమర్పణ



దర్గా

పత్తికొండ రూరల్‌: స్థానిక ఆదోని రోడ్డులో కొలువైన సయ్యద్‌ షా అలీఅక్బర్‌ ఖాద్రీ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి గంధం సమర్పించారు. సాయంత్రం స్వామివారిని భక్తాదులు దర్శించుకుని పూజలు జరిపించారు. ఉరుసు ఉత్సవాల సందర్భంగా దర్గాను ప్రత్యేకంగా అలంకరించారు. 27న ఉరుసు, 28న ఖతమె ఖురాన్‌ ఫాతిహాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు గాయత్రీ ఆలయ వార్షికోత్సవం

వెల్దుర్తి: పట్టణ శివారులోని గాయత్రి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బాలకృష్ణ ఆచారి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక గాయత్రి జపం, దీపయజ్ఞం నిర్వహించారు. వార్షికోత్సవ పూజలతో పాటు పంచకుండి గాయత్రీ యజ్ఞం ఉంటుందన్నారు. భక్తులు సంప్రదాయ దుస్తులతోపాటు మాస్కులు ధరించి పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీలో విచారణ



రోగులను విచారిస్తున్న ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

హొళగుంద: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆదోని డిప్యూటీ డీఎం అండ్‌ హెచ్‌ఓ సత్యవతి విచారణ చేపట్టారు. వైద్యులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఆదోని సబ్‌ కలెక్టర్‌ అభిషేక్‌కుమార్‌ విచారణకు ఆదేశించడంతో ఆమె బుధవారం పీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. రోగులు, ప్రజలను విచారించి వారి ఫిర్యాదులు తీసుకున్నారు. పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లను నియమించినా ఒకరు మాత్రమే విధులకు హాజరవుతున్నట్లు గుర్తించారు. మరో డాక్టర్‌ నెల రోజులుగా గైర్హాజరైనట్లు తెలుసుకున్నారు. ఇదే విషయంపై కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న డాక్టరు, ఫార్మాసిస్ట్‌ మధ్య ఉన్న గొడవలు, ఇతర సమస్యలపై ఆరా తీశామని, నివేదికను సబ్‌ కలెక్టర్‌తో పాటు డీఎం అండ్‌ హెచ్‌ఓకు పంపిస్తామని డాక్టర్‌ సత్యవతి విలేకరులకు తెలిపారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌

నందవరం: ఆడపిల్లలను కాపాడుకుందామని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సుచరిత అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో వారోత్సవాల్లో భాగంగా జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల నుంచి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుమారులతో పాటు కూతుళ్లను సమానంగా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. బాలికా సంరక్షణ కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌ లక్ష్మి, హెల్త్‌ సూపర్‌వైజర్‌ ఇస్మాయిల్‌, ఏఎన్‌ఎం దేవిప్రియ, మహిళా పోలీసు నాగవేణి పాల్గొన్నారు.



గోనెగండ్ల బస్టాండ్‌ ఆవరణంలో మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



వెల్దుర్తిలో సీనియర్‌ మహిళా ఓటరును సన్మానిస్తున్న తహసీల్దార్‌ రాజేశ్వరి



కృష్ణగిరి: బస్టాండ్‌లో విద్యార్థులతో మనవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

ప్రజాస్వామ్యానికి ఓటు ఆయువు పట్టు

● సబ్‌కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌



పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సబ్‌కలెక్టర్‌

ఎమ్మిగనూరు టౌన్‌: ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ఆయువు పట్టు అని, ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్‌ అభిషేక్‌కుమార్‌ సూచించారు. బుధవారం ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల వ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు, మానవహారాలు నిర్వహిస్తూ ప్రజలకు ఓటుపై అవగాహన కల్పించారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని నినాదాలు చేశారు. ఓటు హక్కును నిజాయితీగా ఉపయోగించుకుంటామని ఓటర్లతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.

☛ ఎమ్మిగనూరులో తహసీల్దార్‌ కార్యాలయం నుంచి వైఎస్సార్‌ సర్కిల్‌ వరకు అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్‌ ఓటర్లను సత్కరించి ఓటు హక్కు నమోదు చేసుకున్న ఓటర్లకు సబ్‌ కలెక్టర్‌ అభిషేక్‌కుమార్‌ ఎపిక్‌ కార్డులు, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ జయన్న, మున్సిపల్‌ కమిషనర్‌ గంగిరెడ్డి, ఎంపీడీఓ బంగారమ్మ, ఎంఈఓ ఆంజనేయులు పాల్గొన్నారు. గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మండల అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ వేణుగోపాల్‌, ఎంపీడీఓ ప్రవీణ్‌ కుమార్‌, ఎంఈఓ వినోద్‌ కుమార్‌, ఎస్‌ఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

☛ **నందవరం:** మండల కేంద్రంతో పాటు హాలహర్వి, టి.సోమలగూడూరు, పొనకలదిన్నె, నాగలదిన్నె, ముగతి, పెద్దకొత్తిలి, నదికైరవాడి, ఇబ్రహీంపురం, మాచాపురం తదితర గ్రామ సచివాలయాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లకు అధికారులు అవగాహన కల్పించారు.



పత్తికొండలో మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్‌

☛ **ఆలూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణంలో బుధవారం ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ మల్లికార్జునస్వామి, వైఎస్సార్‌సీపీ నేత గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపీపీ శ్రీరాములు, ఎంపీడీఓ అల్లబకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

☛ **చిప్పగిరి:** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థుతో కలిసి తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ మల్లికార్జున ర్యాలీ నిర్వహించారు.

☛ **తుగ్గలి:** మండల కేంద్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో వ్యాసరచన పోటీల విజేతలకు తహసీల్దార్‌ రవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రాజు పాల్గొన్నారు.

☛ **మద్దికెర:** మండల కేంద్రంలో పేటా స్కూల్‌లో అధికారులు విద్యార్థులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ నాగరాజు పాల్గొన్నారు.

☛ **వెల్దుర్తి:** ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని తహసీల్దార్‌ రాజేశ్వరి సూచించారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆమె తన కార్యాలయంలో సీనియర్‌ సిటిజన్‌ మహిళా ఓటరును సన్మానించారు.

☛ **కృష్ణగిరి:** జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ పురుషోత్తం పాల్గొన్నారు.

☛ **పత్తికొండ రూరల్‌:** ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్‌ కూడలిలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆర్డీఓ మోహన్‌దాస్‌ సూచించారు.

6న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు సందర్భంగా ఫిబ్రవరి 6న రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను అందించనున్నట్లు చెప్పారు. పాల్గొనే ఎడ్ల యజమానులు 9652025099, 7702630416, 9989028249 నంబర్లకు ఫోన్‌ చేసి రూ.500లు ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్‌

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామ సమీపంలో పేకాట రాయుళ్లను బుధవారం అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. పెద్దమరివీడు గ్రామానికి చెందిన వ్యక్తులు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం అందడంతో సాయంత్రం సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. సప్పోగు లోకేష్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.11,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

సారా విక్రేతల అరెస్ట్‌

వెల్దుర్తి: మండల పరిధిలోని బోయనపల్లె గ్రామంలో సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను బుధవారం అరెస్ట్‌ చేసినట్లు సీఐ శ్యాంప్రసాద్‌ తెలిపారు. వెల్దుర్తి పోలీసులతో సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో నిందితులు బోయనపల్లె బోయ సాలమ్మ, రత్నపల్లె ఈడిగ శివమ్మల వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను డోన్‌ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్‌ రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు.

కర్ణాటక ప్రభుత్వం దృష్టికి గడినాడు కన్నడిగుల సమస్యలు

● బెంగళూరులో సమావేశానికి హాజరు



బెంగళూరులో సమావేశంలో పాల్గొన్న గడినాడు కన్నడిగులు

హొళగుంద: ఆంధ్రప్రదేశ్‌ సరిహద్దు ప్రాంతాల్లో ఉంటున్న గడినాడు కన్నడిగుల సమస్యలపై బుధవారం బెంగళూరులో జరిగిన సమావేశంలో చర్చించారు. హొళగుంద, ఆదోని, హాలహర్వి, పెద్ద హరివాణం, కౌతాళం తదితర మండలాల కన్నడ సంఘం నాయకులు దొడ్డ బసప్ప, గురుబసవరాజు, జంబునాథ్‌ తదితరులు సమావేశానికి హాజరై ముఖ్య అధికారి సోమశేఖర్‌కు ఈ ప్రాంత కన్నడిగుల సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేశారు. 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిపోయి ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఏపీలోని సరిహద్దు గ్రామాల్లో ఉంటున్న కన్నడిగులను గడినాడు కన్నడిగులుగా గుర్తించాలని కోరారు. కన్నడ విద్యార్థులు అధికంగా ఉన్నారని, వారికి ఉద్యోగాల పరంగా కర్ణాటక, ఏపీ రాష్ట్రాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. గడి నాడు కన్నడిగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరినట్లు సంఘం నాయకులు తెలిపారు.

ముమ్మరంగా వంతెన నిర్మాణ పనులు



నాగలదిన్నె వంతెనపై కాంక్రీట్‌ పనులు చేస్తున్న దృశ్యం

నందవరం: ఆంధ్ర – తెలంగాణ సరిహద్దులను కలుపుతూ నిర్మిస్తున్న వంతెనపై ఫ్లోరింగ్‌ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 2009 వరద ధాటికి నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జి కూలిపోయిన విషయం విధితమే. తెలంగాణ–ఆంధ్ర సరిహద్దులను కలుపుతూ బంధాలకు వారధిగా వంతెన నిలిచింది. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో దశాబ్దానికిపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో వంతెన నిర్మాణం పూర్తి చేయిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించక వంతెన నిర్మాణ పనులను పెండింగ్‌ పెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పెండింగ్‌ బిల్లులు సైతం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో వంతెనపై రోడ్డు నిర్మాణంలో కాంక్రీట్‌ పనులు వేగంగా సాగుతున్నాయి. ఫిబ్రవరి చివరి నాటికి వంతెన నిర్మాణం పూర్తవుతుందని ఏజెన్సీ కిరణ్‌, సూపర్‌వైజర్‌ నాగుర్‌బాబు తెలిపారు.